క్లుప్తంగా

దాసాంజనేయ ఆలయంలో ప్రత్యేక పూజలు

మధురానగర్(విజయవాడసెంట్రల్):స్వయంభూ మాచవరం దాసాంజనేయస్వామివారి దేవాలయంలో శనివారం స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఆలయ అర్చకులు స్వామివారికి ప్రీతికరమైన సింధూరం, ఆకుపూజలు చేశారు. పెద్ద సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకుని భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. వాహన చోదకులు వాహన పూజలు చేయించుకున్నారు. కార్యక్రమాలను ఆలయ కార్యనిర్వహణాధికారి నాగినేని భవాని పర్యవేక్షించారు.

ఘనంగా ఏపీయూడబ్ల్యూజే వ్యవస్థాపక దినోత్సవం

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ఆంధ్రప్రదేశ్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (ఏపీయూడబ్ల్యూజే) 68 వ వ్యవస్థాపక దినోత్సవం గాంధీనగర్ ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఏపీయూడబ్ల్యూజే నాయకులు యూనియన్ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం బందరు రోడ్డులోని నిర్మల్ హృదయ్ భవన్‌లో వృద్ధులకు పండ్లు పంపిణీ చేశారు. యూనియన్ కార్యదర్శి చందు జనార్ధన్, యూనిట్ అధ్యక్షుడు చావా రవి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు కె.జయరాజ్, విజయవాడ యూనిట్ కార్యదర్శి దారం వెంకటేశ్వరరావు, ప్రెస్ క్లబ్ కార్యదర్శి దాసరి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

నాగేశ్వరరావు మృతిపై విచారణ చేయాలి



అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): నాగేశ్వరరావు మృతిపై పోలీసులు విచారణ చేపట్టాలని సీపీఐ నాయకులు కేవీ భాస్కరరావు డిమాండ్ చేశారు. సింగ్‌నగర్ డాబాకొట్లు సెంటర్‌లోని రూపా లక్ష్మీసాయి బార్ ఎదుట సీపీఐ ఆధ్వర్యంలో శనివారం నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బార్‌లో మృతిచెందిన నాగేశ్వరరావు కల్తీ మద్యం సేవించాడా? లేక మరే ఇతర కారణాలు ఉన్నాయనేది విచారణలో తేల్చాలని కోరారు. కల్తీ మద్యం వల్లనే ఆయన చనిపోయినట్లయితే అందుకు కారకులైన వారిపై చర్యలకు తీసుకోవాలని కోరారు. స్వాతంత్య్ర దినోత్సవం నాడు మద్యం విక్రయాలను యథేచ్ఛగా చేపట్టినా ఎక్సైజ్ శాఖ ప్రేక్షకపాత్ర వహించడం శోచనీయమని తెలిపారు. నాగేశ్వరరావు మృతిపై పూర్తి విచారణ చేసి వారి కుటుంబాన్ని ఆదుకోవాలన్నారు. సీపీఐ నాయకులు లింగాబత్తుల శివ కుమార్, కంది ఆదినారాయణ, పాపారావు, గురవయ్య, నాగరాజు, ఉమామహేశ్వరరావు, శెట్టి గారు, కన్నమ్మ, రాజ్యలక్ష్మి, షేక్ నన్నేబి, షేక్ మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.

బుడమేరులో వ్యర్థాలు



మధురానగర్(విజయవాడసెంట్రల్):30వ డివిజన్ జీవీఆర్‌నగర్, దావు బుచ్చయ్యకాలనీలో బుడమేరు డంపింగ్ కేంద్రంగా మారింది. కొందరు భవన నిర్మాణ వ్యర్థాలు తీసుకొచ్చి బుడమేరులో వేస్తున్నారు. పట్టపగలే ఇష్టానుసారం భవన నిర్మాణ వ్యర్థాలు పోసి బుడమేరు పూడ్చివేస్తుంటే పట్టించుకునేవారే లేరని స్థానికులు అంటున్నారు. దీని వల్ల నీటి ప్రవాహానికి ఆటంకం ఏర్పడుతుందని తెలిపారు. దీని వల్ల దోమలు సైతం పెరిగిపోతున్నాయని వాపోతున్నారు. ఎవరికివారు తమ స్వలాభం కోసం బుడమేరును పూడ్చివేసి వ్యాపారాలు సాగించటానికి ప్రయత్నించడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

యాంటీ లార్వా ఆపరేషన్...

బుడమేరులో శనివారం యాంటీ లార్వా ఆపరేషన్స్ నిర్వహించారు. డ్రోన్‌ల ద్వారా ఎంఎల్ ఆయిల్ స్ప్రే చేయటంతో పాటు బుడమేరులో పేరుకుపోయిన చెత్తచెదారం తొలగించారు. మురుగు ప్రవాహానికి ఆటంకంగా మారిన జమ్ము, పిచ్చి మొక్కలను తరలించారు. ఈ సందర్భంగా దోమల నివారణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు.

విద్యుత్‌శాఖ విజిలెన్స్ ఆకస్మిక తనిఖీలు

లబ్బీపేట(విజయవాడతూర్పు): విద్యుత్‌శాఖ విజిలెన్స్ అధికారులు శనివారం పలు ప్రాంతాల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. మొగల్రాజపురం సెక్షన్ పరిధిలో విజిలెన్స్, ఆపరేషన్ అధికారులు కలిసి 46 బృందాలుగా ఏర్పడి తనిఖీలు చేశారు. అందులో భాగంగా 79 కేసులు నమోదు చేసి, రూ.5.04 లక్షలు జరిమానాలు విధించారు. అధికంగా వాడుకుంటున్న విద్యుత్ లోడ్ క్రమబద్ధీకరణ, ఒకే ఇంట్లోని ఒకే ఫ్యామిలీ రెండు సర్వీసుల నుంచి సరఫరా తీసుకోవడం వంటి వాటిని గుర్తించి నోటీసులు జారీ చేశారు. వీటిని విజయవాడ టౌన్ ఈఈ బీవీ సుధాకర్, విజిలెన్స్ ఈఈ కమలకుమారి పర్యవేక్షించారు. దాడుల్లో డి3 ఏడీఈ పి. శ్రీధర్, మొగల్రాజపురం ఏఈ బి.వెంకట్రావు, టౌన్ డివిజన్ ఏడీఈలు, ఏఈలు, విద్యుత్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆత్మీయ బంధానికి ప్రతీక రక్షాబంధన్

- 19న రాఖీ పౌర్ణమి
- ఆకట్టుకుంటున్న విభిన్న రాఖీలు
- కళకళలాడుతున్న వన్‌టౌన్‌లోని హోల్‌సేల్ దుకాణాలు
- ఆన్‌లైన్‌లోనూ రాఖీల అమ్మకాలు
- ఈ ఏడాది బంగారు దుకాణాల్లో వెండి రాఖీలు
- చిన్నారులను అలరిస్తున్న డోరేమాన్, బ్యాట్‌మ్యాన్ రాఖీలు



వివిధ మోడల్స్‌లో వన్‌టౌన్ హోల్‌సేల్ మార్కెట్‌లో విక్రయిస్తున్న రాఖీలు



చిన్నారులను ఆకట్టుకుంటున్న మిక్కీమౌస్, బ్యాట్‌మ్యాన్ రాఖీలు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): అన్నా చెల్లెళ్లు.. అక్కా, తమ్ముళ్ల మధ్య ఆత్మీయ బంధానికి చిహ్నంగా నిర్వహించుకునే పండుగ రక్షాబంధన్. రక్త సంబంధీకులు లేకున్నా... మన కోసం అండగా నిలిచే ఆప్తుల్ని సమాజం అందిస్తుంది. అలాంటి వారికి రాఖీ కట్టి సోదరభావాన్ని పెంపొందించుకోవడానికి రాఖీ పౌర్ణమి మంచి సందర్భం. సోదరుడంటే తోడబుట్టిన వాడే కానక్కర్లేదు. చెల్లెమ్మ... నేనున్నానంటూ రక్షగా నిలిచే ప్రతి ఒక్కరూ సోదర సమానమే. అందుకే వీరి అనుబంధానికి ప్రతీకగా శ్రావణమాసంలో పౌర్ణమినాడు రక్షాబంధన్ (రాఖీ) పండుగ జరుపుకుంటారు.

జోరందుకున్న అమ్మకాలు

ఈ నెల 19వ తేదీ సోమవారం రాఖీ పర్వదినాన్ని పురస్కరించుకొని వన్‌టౌన్‌లో రాఖీ విక్రయాలు జోరందుకున్నాయి. విభిన్న ఆకృతులు, ఆకర్షణీయమైన రంగులు, చూడగానే ఆకట్టుకుంటున్న మోడల్స్‌లో రాఖీలు యువతకు కనువిందు చేస్తున్నాయి. ఈ సారి వివిధ రూపాల్లో మార్కెట్‌లోకి వచ్చిన రాఖీలు చూడగానే ముచ్చటగొలిపే విధంగా ఉన్నాయి. ఉత్తరాది, దక్షిణాది ప్రాంతాల ప్రజల అభిరుచులకు అనుగుణంగా మార్కెట్‌లో రాఖీల విక్రయాలు జరుగుతున్నాయి. వన్‌టౌన్‌లోని హోల్‌సేల్ దుకాణాల్లో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వ్యాపారులు రాఖీలను పెద్ద సంఖ్యలో కొనుగోలు చేసి తీసుకెళ్తున్నారు. దాంతో ఆయా దుకాణాలు కళకళలాడుతూ కనిపించాయి.

రూ.5 నుంచి రెండు వందల వరకూ ధరలు

రాఖీలు ఐదు నుంచి రెండు వందల రూపాయాల వరకూ ధర పలుకుతున్నాయి. అన్ని వర్గాలకు అవసరమైన రాఖీలను వన్‌టౌన్‌లో విక్రయిస్తున్నారు. వీటిని ఆయా రిటైల్ మార్కెట్లలో రెట్టింపు ధరలకు విక్రయిస్తారని హోల్‌సేల్ వ్యాపారులు చెబుతున్నారు. వన్‌టౌన్ హోల్‌సేల్ మార్కెట్ నుంచి కేవలం విజయవాడ, ఉమ్మడి కృష్ణా జిల్లాకే పరిమితం కాకుండా గుంటూరు, పశ్చిమ గోదావరి, ప్రకాశం తదితర జిల్లాల నుంచి కూడా వ్యాపారులు రాఖీలను హోల్‌సేల్‌గా కొనుగోలు చేసి తీసుకెళ్తున్నారు. దాంతో రెండు మూడు రోజులుగా రాఖీల వ్యాపారం వన్‌టౌన్‌లో జోరుగా సాగుతోంది.

బొమ్మలు చూసి ఆసక్తిగా కొనుగోలు

చిన్నారులకు ఆకట్టుకునేందుకు డోరేమాన్, మోటు పంతులు, మిక్కీమౌస్, హనుమాన్ వంటి బొమ్మలను రాఖీలపై ఏర్పాటు చేయడంతో వాటిని చిన్నారులు ఆసక్తిగా చూసి కొనుగోలు చేస్తున్నారు. చిన్నారుల కోసం ప్రత్యేకంగా వాటిని తయారు చేశారని హోల్‌సేల్ వ్యాపారులు చెబుతున్నారు.

అందుబాటులో అనేక మోడల్స్

దుకాణాల్లోనే కాకుండా ఆన్‌లైన్‌లోనూ రాఖీల అమ్మకాలు విస్తృతంగా జరుగుతున్నాయి. వివిధ వెబ్‌సైట్లలో రాఖీలకు సంబంధించి అనేక మోడళ్లు అందుబాటులో ఉన్నాయి. వాటికి పలు ఆఫర్లను సైతం అందిస్తున్నాయి. దానికి తోడు వెండితో తయారు చేసిన రాఖీలను ఆన్‌లైన్‌లో విక్రయిస్తున్నారు. ఆన్‌లైన్‌లో ఎనిమిది వందల నుంచి నాలుగు వేల వరకూ వెండితో తయారు చేసిన రాఖీలు విక్రయిస్తున్నారు. ప్రముఖ బంగారు దుకాణాలు సైతం ఆన్‌లైన్‌లో ఇలాంటి రాఖీలను విక్రయిస్తున్నాయి.



మార్కెట్‌లో విక్రయిస్తున్న వెండి రాఖీలు,

ముమ్మరంగా పారిశుద్ధ్య పనులు



పాయకాపురం(విజయవాడరూరల్):విలేజి కండ్రికలో పారిశుద్ధ్య పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. అదనంగా సిబ్బందిని ఏర్పాటు చేసి విలేజి కండ్రికలోని ప్రతివీధిలో డ్రైనేజీ కాల్వల్లో వ్యర్థాలు తొలగించి మురుగు నీరు పారుదలయ్యే విధంగా చర్యలు తీసుకున్నారు. పశువుల వ్యర్థాలన్నీ కాల్వల్లోకి చేరుకోవడంతో పేరుకుపోయి మురుగునీరు పారుదల లేకపోవడంతో దోమలు వృద్ధి చెందాయి. ఈ సమస్యను కార్పొరేటర్ యరగొర్ల తిరుపతమ్మ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఆమె శానిటరీ అధికారులతో మాట్లాడి పారిశుద్ధ్య పనులు చేయించారు.

ఆర్థిక సాయం అందజేత

పాయకాపురం(విజయవాడరూరల్):అనారోగ్య సమస్యతో బాధపడుతున్న తుమ్మల సత్యనారాయణకు వైద్య ఖర్చుల కోసం కమ్మ ఐక్య సేవా సమితి ఆధ్వర్యంలో శనివారం ఆర్థిక సహాయం అందజేశారు. సెంట్రల్ నియోజకవర్గానికి చెందిన సత్యనారాయణ గత కొంత కాలంగా కాలేయ సంబంధిత వ్యాధితో బాధపడుతున్నారు. ఈ నేపథ్యంలో రూ. 50,336 సమితి కార్యవర్గ సభ్యులు పరుచూరి ప్రసాద్, కమ్మ దర్శిని వ్యవస్థాపకులు ఉప్పలపాటి ప్రవీణ్, తుమ్మల సత్యనారాయణ అందజేశారు.

దేశ నిర్మాణంలో విద్యార్థుల భాగస్వామ్యం

రైల్వేస్టేషన్(విజయవాడపశ్చిమ): దేశ నిర్మాణంలో విద్యార్థులు భాగస్వాములు కావాలని సారా ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు కమలాకర్ పేర్కొన్నారు. సారా ఫౌండేషన్ ఆధ్వర్యాన పోరంకిలో ఈ నెల 15న విద్యార్థులకు నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించింది. అందులో గెలుపొందిన విద్యార్థులకు శనివారం బహుమతులను ప్రదానం చేశారు. ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు, గుంటూరు డివిజన్ డీసీఎం కమలాకర్ మాట్లాడుతూ విద్యార్థుల్లో ప్రతిభను గుర్తించి ప్రోత్సహించడమే ముఖ్య ఉద్దేశమన్నారు. దేశ చరిత్ర, సంస్కృతి, సంప్రదాయాలపై క్విజ్ పోటీలు, మై విజన్ ఇండియాపై వ్యాసరచన, స్వాతంత్య్ర పోరాటాలపై డ్రాయింగ్ పోటీలు, దేశ భక్తి పాటలు, నృత్య ప్రదర్శలు, హస్తకళలు తదితర పోటీలు నిర్వహించినట్లు తెలిపారు. 60 మంది విద్యార్థులు ప్రతిభను చాటుకున్నారు. విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.



నైపుణ్యాభివృద్ధి కార్యక్రమంలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందిస్తున్న దృశ్యం

ఔషధ పరిశోధనలో నూతన ఆవిష్కరణ

లబ్బీపేట(విజయవాడతూర్పు): ఔషధ పరిశోధనల్లో నూతన ఆవిష్కరణలపై విద్యార్థులు, ఉపాధ్యాయులకు అవగాహన కలిగించేందుకు శనివారం కేవీఎస్ఆర్ సిద్ధార్థ ఫార్మసీ కళాశాలలో సదస్సు నిర్వహించారు. ఆ కళాశాల ఫార్మకాగ్నసీ విభాగం ఆధ్వర్యాన నిర్వహించిన సదస్సులో జాతీయ కేంద్ర నియంత్రణ మండలి డిప్యూటీ డ్రగ్ కంట్రోలర్ డాక్టర్ ఎ.రామకిషన్, డాక్టర్ ఎం శ్రావణ్ కుమార్‌లతో పాటు, ఐపీఏ ఎడ్యుకేషన్ చైర్‌పర్సన్ ఎస్. విద్యాధర పాల్గొన్నారు. ఔషధ పరిశోధనల్లో నూతన ఆవిష్కరణలను విశ్లేషణాత్మకంగా వివరించారు. కార్యక్రమంలో సిద్ధార్థ అకాడమీ అధ్యక్షుడు డాక్టర్ చదలవాడ నాగేశ్వరరావు, ప్రిన్సిపాల్ సునీత, రిటైర్డ్ ప్రొఫెసర్ డాక్టర్ జి.ఈశ్వర్, డాక్టర్ రమణ తదితరులు పాల్గొన్నారు. సదస్సులో 10 ఫార్మసీ కళాశాలల నుంచి 375 మంది విద్యార్థులు పాల్గొనగా, 75 మంది పోస్టర్ ప్రజెంటేషన్స్ చేశారు.



డెప్యూటీ డ్రగ్ కంట్రోలర్ డాక్టర్ రామకిషన్‌ను సత్కరిస్తున్న ప్రిన్సిపాల్ సునీత, డాక్టర్ రమణ

కలగా మిగిలిన వాకింగ్ ట్రాక్

మధురానగర్(విజయవాడసెంట్రల్):దేవీనగర్ వాసుల వాకింగ్ ట్రాక్ కలగానే మిగిలిపోయింది. ట్రాక్ నిర్మాణంలో భాగంగా చేపట్టిన ప్రహరీ పనులు మధ్యలోనే నిలిచిపోయాయి. కాలువల సుందరీకరణ సందర్భంగా దేవీనగర్ బుడమేరు పక్కన ఇళ్లను తొలగించారు. ఆ ప్రాంతంలో స్థానికుల విజ్ఞప్తి మేరకు వాకింగ్ ట్రాక్ నిర్మించాలని నిర్ణయించారు. ఎన్నికలకు ముందు ప్రహరీ నిర్మాణ పనులు చేపట్టారు. అయితే ఇంతలో ఎన్నికలు రావటంతో పనులు మధ్యలోనే నిలిపివేశారు. ఈ ప్రాంతాన్ని పట్టించుకునే వారు లేకపోవటంతో పిచ్చి మొక్కలు పెరిగిపోవటంతో పాటు స్థానికులు చెత్తచెదారం వేస్తున్నారు. దీంతో పరిసరాలు అపరిశుభ్రంగా మారి విషసర్పాలు, కీటకాలు, దోమలకు ఆవాస కేంద్రంగా మారాయి. స్థానికులు తీవ్ర భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. విషసర్పాలు ఇళ్లలోకి సైతం చొరబడుతున్నాయని తెలిపారు. తగు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



పెరిగిపోయిన పిచ్చి మొక్కలు

బహుముఖ ప్రతిభాశాలి రామలింగశాస్త్రి

విజయవాడ కల్చరల్: బహుముఖ ప్రతిభాశాలి డాక్టర్ వేదాంతం రామలింగ శాస్త్రి అని నాట్యాచార్యుడు డేగల సాంబశివరావు అన్నారు. శ్రీ వాగ్దేవి కూచిపూడి నృత్యాలయ ఆధ్వర్యంలో గాంధీనగర్‌లోని హనుమంతరాయ గ్రంథాలయంలో శనివారం నృత్య నీరాజనం 2024, నాట్యాచార్యుడు డాక్టర్ వేదాంతం రామలింగశాస్త్రికి గురు సత్కార కార్యక్రమం నిర్వహించారు. సాంబశివరావు మాట్లాడుతూ కూచిపూడి నాట్య సంప్రదాయ కుటుంబానికి చెందిన రామలింగశాస్త్రి కూచిపూడి సిద్ధేంద్రయోగి పీఠం ఆచార్యునిగా విశేష సేవలను అందించినట్లు తెలిపారు. వందలాది మందికి కూచిపూడి నృత్యంలో శిక్షణ నిచ్చినట్లు తెలిపారు. వాగ్దేవీ కూచిపూడి నృత్యాలయ వ్యవస్థాపకుడు సప్పా శివకుమార్ మాట్లాడుతూ కూచిపూడి గ్రామం నేడు అంతర్జాతీయ కీర్తి వచ్చిందంటే కూచిపూడి నాట్యమే కారణమని తెలిపారు. నాట్యాచార్యుడు రామలింగశాస్త్రి దంపతులను శివకుమార్ దంపతులు వేదోక్తంగా గురువందన కార్యక్రమం నిర్వహించారు. నాట్యాచార్యులు పిళ్ళా ఉమామహేశ్వర పాత్రుడు, వాణిజ్యశాఖ అధికారి, వీసీవీవీడీఎస్ కుమార్, ఘంటసాల పవన్‌కుమార్, మాగలూరి త్రినాథాచారి, డాక్టర్ వేదాంతం రాధేశ్యాం, ధనలక్ష్మి తదితరులు పాల్గొన్నారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన నాట్యాచార్యులు, చిన్నారులు సంప్రదాయ నృత్యాలను ప్రదర్శించారు. ప్రతిభ చూపిన చిన్నారులకు శ్రీ వెంకటేశ్వర, బసవ నంది పురస్కారాలతో సత్కరించారు.



డాక్టర్ వేదాంతం రామలింగశాస్త్రి దంపతులకు గురువందనం నిర్వహిస్తున్న దృశ్యం

మంచి ఆలోచనలతో ముందుకు సాగాలి

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): విద్యార్థులు మంచి ఆలోచనలతో అడుగులు వేసినప్పుడు చక్కని విజయాలను అందుకుంటారని మనస్తత్వవేత్త డాక్టర్ బి.అరుణ అన్నారు. పొట్టిశ్రీరాములు చలవాది మల్లికార్జునరావు కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ బాలెన్సింగ్ సోషల్ లైఫ్ విత్ స్టడీస్' అంశంపై సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ అరుణ మాట్లాడుతూ విద్యార్థులు జీవితంలో లక్ష్యాలను సాధించేందుకు నిర్దిష్ట ప్రణాళికలు అవసరమన్నారు. పరీక్షలు, ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకునేందుకు ముందుకు సాగాలన్నారు. సామాజిక అంశాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. ఇతరులకు మంచి జరగాలనే భావనతో ఉంటే మనకు మేలు జరుగుతుందనే భావనలను పెంపొందించుకోవాలన్నారు.

నేడు టీటీ రాష్ట్ర ర్యాంకింగ్ ఫైనల్స్



విజయవాడస్పోర్ట్స్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర స్థాయి టేబుల్ టెన్నిస్ ర్యాంకింగ్ పోటీలు ఫైనల్ దశకు చేరుకున్నాయని పోటీల ఆర్గనైజింగ్ సెక్రటరీ వై. దామోదర్ రెడ్డి తెలిపారు. వడ్డేశ్వరంలోని కేఎల్ యూనివర్సిటీలో ఈ నెల 16వ తేదీన ప్రారంభమైన ఈ పోటీలు శనివారం రెండో రోజు ఉత్కంఠ భరితంగా సాగాయి. అండర్ 11, 13, 15, 19, సీనియర్ స్త్రీ, పురుషుల విభాగాల్లో క్రీడాకారులు తలపడ్డారు. ఎన్టీఆర్ జిల్లా టేబుల్ టెన్నిస్ అసోసియేషన్, దామస్ టేబుల్ టెన్నిస్ అకాడమీ సంయుక్త ఆధ్వర్యంలో ఈ పోటీలు జరుగుతున్నాయి. సీనియర్ పురుషుల విభాగంలో టి.సూర్యతేజ, కుషల్ దాస్, మహిళల విభాగంలో ఆర్.కాజల్ సునార్, వి.గుణసంయుక్త, అండర్–17 బాలుర విభాగంలో టి.సంవేద్, పి.జాతిన్ రెడ్డి, బాలికల విభాగంలో ఆర్ఎన్‌పీఎస్‌జీ రేణుకసత్య, పి.హాసిని ఫైనల్స్‌కు చేరుకున్నారని దామోదర్ రెడ్డి తెలిపారు. ఆదివారం టోర్నీ ముగియనుందని, ముగింపు కార్యక్రమంలో విజేతలకు ట్రోఫీలు, మెడల్స్, సర్టిఫికెట్లు అందజేస్తామని వెల్లడించారు.

పురస్కారాలకు దరఖాస్తు చేసుకోండి

మధురానగర్(విజయవాడసెంట్రల్):ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని విద్యార్థులను భావి భారత పౌరులుగా తీర్చిదిద్దుతున్న ఉత్తమ ఉపాధ్యాయులను గుర్తించి ఉపాధ్యాయ రత్న, ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాలతో సత్కరించటానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సరేజానాసుభి నోభవంతు సామాజిక, సాంస్కృతిక సేవా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ ఐఎస్ఎస్ నారాయణ మాస్టారు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. హైదరాబాద్‌లో సెప్టెంబర్ 8వ తేదీన ప్రముఖుల చేతులమీదుగా ఎంపిక చేసిన ఉపాధ్యాయులను పురస్కారంతో సత్కరించనున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి, అర్హత కలిగిన ఉపాధ్యాయులు వారు అందిస్తున్న సేవల వివరాలతో ఈ నెల 31వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. మరింత సమాచారం కోసం 9652347207 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

నేడు రోటరీ మిడ్‌టౌన్ మెగా లోన్ మేళా

లబ్బీపేట(విజయవాడతూర్పు): రోటరీ క్లబ్ ఆఫ్ విజయవాడమిడ్‌టౌన్ ఆధ్వర్యంలో ఆదివారం మెగా లోన్ మేళా నిర్వహించనున్నట్లు ఆ క్లబ్ అధ్యక్షుడు గుడిపాటి కిషోర్ తెలిపారు. ఎంజీ రోడ్డులోని హోటల్ వివంతలో ఉదయం 10 నుంచి సాయంత్రం 6 గంటల వరకూ లోన్‌మేళా నిర్వహించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా శనివారం ఓ హోటల్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో లోన్‌మేళా పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం గుడిపాటి కిషోర్, లోన్‌మేళా చైర్మన్ సతీష్‌కుమార్ మాట్లాడుతూ రోటరీ క్లబ్ ప్రపంచ వ్యాప్తంగా అనేక సేవా కార్యక్రమాలు చేస్తూ సమాజాభివృద్ధికి కృషి చేస్తున్నట్లు తెలిపారు.

దుర్గమ్మకు నృత్యాంజలి



భవానీపురం(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న కనకదుర్గమ్మకు చెన్నైకు చెందిన కళాకారిణులు నృత్యాంజలి ఘటించారు. శ్రీదుర్గా మల్లేశ్వరస్వామివార్ల దేవస్థానంలో ప్రతి రోజూ నిర్వహించే ధర్మపథం కార్యక్రమంలో భాగంగా శనివారం సాయంత్రం జరిగిన సాంస్కృతిక ప్రదర్శనలో కళాకారిణులు భరతనాట్యంతో భక్తులను అలరించారు. మైత్రి సెంటర్ ఫర్ ఫైన్ ఆర్ట్స్ (చెన్నై) సంస్థకు చెందిన కళాకారిణులు నృత్యాంజలి అంశంతో ప్రారంభించి 'శివోహం', 'ఆనంద నటన ప్రకాశం', 'గోవిందం', 'దేవి – మాతృ సమర్పణం' అంశాలకు చక్కని ఆహార్యం, అభినయంతో నర్తించారు. వారి అద్భుత నాట్యంతో భక్తులు తన్మయులై హర్షధ్వానాలు చేశారు.

ఉద్యోగుల సహకారంతో నగరాభివృద్ధి

పటమట(విజయవాడతూర్పు): మున్సిపల్ ఎంప్లాయీస్ అందరూ సహకరిస్తేనే నగరాభివృద్ధి చెందుతుందని వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర అన్నారు. వీఎంసీ ప్రధాన కార్యాలయంలోని ఆయన ఛాంబర్లో శనివారం ఏపీ జేఏసీ అమరావతి చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు యూనియన్ నాయకులతో కలిసి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర్లు మున్సిపల్ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను, ప్రమోషన్లపై కమిషనర్‌ను కోరారు. దీనిపై కమిషనర్ స్పందిస్తూ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించేందుకు తాను ముందుంటానని చెప్పారు. కమిషనర్‌ను కలిసిన వారిలో మున్సిపల్ ఎంప్లాయీస్ సర్వీస్ అసోసియేషన్ రాష్ట్ర, వీఎంసీ యూనిట్, ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షులు తిమసర్తి నాగేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి సలీం అహ్మద్ ఇతర కార్యవర్గ సభ్యులు ఉన్నారు.



వీఎంసీ కమిషనర్‌ను కలిసిన ఏపీ జేఏసీ అమరావతి చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు

జీఎస్ రాజు రోడ్డులో ఆక్రమణలు కనిపించవా ?

పట్టించుకోని టౌన్ ప్లానింగ్ సిబ్బంది

సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్): పేదరికంతో బతుకునీడుస్తూ రోడ్ల పక్కన చిరు వ్యాపారులు చేసుకునే వారి దుకాణాలు తొలగించేదాక నిద్రపోని నగర పాలక సంస్థ టౌన్ ప్లానింగ్ అధికారులు సెంట్రల్ నియోజవర్గంలోని జీఎస్ రాజు రోడ్డులో కొంతమంది యథేచ్ఛగా ఆక్రమణలు చేపట్టినా పట్టించుకోకపోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఒక పక్క సెంట్రల్ నియోజవర్గ నేత ఆదేశాల మేరకు ఎన్నో ఏళ్లుగా బీఆర్టీఎస్‌రోడ్డులో వ్యాపారాలు చేసుకుంటున్న చిరువ్యాపారుల దుకాణాలను టౌనింగ్ ప్లానింగ్ సిబ్బంది తొలగిస్తున్నారు. మరో పక్క మాత్రం సత్యనారాయణపురంలోని జీఎస్ రాజు రోడ్డు అంతిమయాత్ర భవనం వద్ద తాజాగా కొంతమంది ఆక్రమణదారులు ఎటువంటి అనుమతులు లేకుండా బడ్డీ కొట్లు, బిర్యానీ బండ్లు, మాంసాహార స్టాల్స్, కూరగాయల దుకాణాలు ఏర్పాటు చేసుకుంటుంటే అటుగా కన్నెత్తి కూడా చూడకపోవడంపై ఆరోపణలు వస్తున్నాయి.

సెంట్రల్ నియోజకవర్గ నేత అండదండలు ఉండటమే కారణంగా తెలుస్తుంది. నిబంధనలు ఎవరికైనా ఎకటే ఉండాలి కాని అధికారపార్టీ నేతలకు ఒకలాగ, సామాన్య ప్రజలకు ఒకలాగా ఉండటమేంటని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. అనధికార వ్యాపారాల కారణంగా జీఎస్ రాజు రోడ్డు నుంచి ప్రభాస్ కాలేజీ మలుపు ఉండటంతో అక్కడ ట్రాఫిక్ నిలిచిపోతుందని పలువురు వాహనచోదకులు అంటున్నారు. అదే విధంగా ఈ మలుపు వద్దే ఎన్నో ఏళ్లుగా ఒక కారు శిథిలావస్థకు చేరుకుని అడ్డంగా ఉంది. అక్కడ దుకాణదారులు వ్యర్థాలు సైతం దాంట్లోనే పడేస్తుండంతో వాటిని తొలగించేందుకు పారిశుద్ధ్య సిబ్బందికి కష్టతరంగా మారుతుంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి అనుమతులు లేని ఆక్రమణలను తొలగించి ట్రాఫిక్‌కు ఇబ్బందులు లేకుండా చూడాలని స్థానిక ప్రజలు,నివాసుల కోరుతున్నారు.



జీఎస్ రాజు రోడ్డులో తాజాగా వెలసిన ఆక్రమణలు

అన్న క్యాంటీన్లపై నిరంతర పర్యవేక్షణ

- వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర
- 11 మంది నోడల్ అధికారుల ఏర్పాటు

పటమట(విజయవాడతూర్పు): అన్న క్యాంటీన్లను నిరంతరం పర్యవేక్షిస్తుండాలని వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర అధికారులను ఆదేశించారు. వీఎంసీ ప్రధాన కార్యాలయంలోని ఆయన చాంబర్లో శనివారం సిబ్బందితో ఆయన టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. వీఎంసీ పరిధిలో వివిధ ప్రాంతాల్లో ఉన్న 11 అన్న క్యాంటీన్లను నిరంతరం పర్యవేక్షించడానికి 11 మంది నోడల్ అధికారులను ఏర్పాటు చేశామన్నారు. వారు అందుబాటులో ఉండి ఎటువంటి సమస్యనా వెంటనే సంబంధిత శాఖలకు తెలియపరచాలని, ఆ శాఖాధిపతులు 15 నిమిషాలలో పరిష్కరించాలని ఆయన ఆదేశించారు. నోడల్ అధికారులు నిరంతరం పర్యవేక్షిస్తూ నివేదికను సమర్పించాలని కమిషనర్ ధ్యానచంద్ర ఆదేశించారు.



టెలికాన్ఫరెన్స్‌లో ధ్యానచంద్ర